క్లుప్తంగా

రైతుబజార్

మల్కాజిగిరి సర్కిల్ పరిధిలోని నేరేడ్‌మెట్, జేజేనగర్, పీవీఎన్ కాలనీల్లో గురువారం రైతు బజార్(వారాంతపు సంత) నిర్వహిస్తారు.

వైద్య సేవలు

అల్వాల్, మల్కాజిగిరి, జవహర్‌నగర్, మౌలాలి ప్రభుత్వ ఆసుపత్రుల్లో గురువారం కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు, దంత పరీక్షలు నిర్వహిస్తారు.

కరెంటు ఉండని ప్రాంతాలు

మల్లాపూర్: విద్యుత్ మరమ్మతుల కారణంగా గురువారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు 11కేవీ వైజయంతి థియేటర్ ఫీడర్ పరిధిలో నాచారం ప్రధాన రహదారి, కార్తికేయనగర్, అన్నపూర్ణ కాలనీ, రాఘవేంద్ర నగర్, ఎర్రగుంట, అంబేడ్కర్‌నగర్, శ్రీరామ్‌నగర్, కౌండిన్యనగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏడీఈ దశరథ్ తెలిపారు.

హుండీ లెక్కింపు



మల్కాజిగిరి: మల్కాజిగిరి ఆనంద్‌బాగ్‌లోని లక్ష్మీవేంకటేశ్వర స్వామి దేవస్థానం హుండీ లెక్కింపు బుధవారం దేవాదాయశాఖ అధికారి వెంకన్న పర్యవేక్షణలో జరిగింది. నలభై రోజుల హుండీ లెక్కించడంతో రూ.3,97,078 ఆదాయం వచ్చిందని దేవస్థానం ఈవో రవీందర్‌రెడ్డి తెలిపారు. హుండీ లెక్కింపులో అర్చకులు వెంకటరమణాచార్యులు, తులసి రమణాచార్యులు, పాలకమండలి మాజీ చైర్మన్లు ఉమేష్‌సింగ్, సంతోష్, సభ్యులు గణేష్, రవీందర్, ఆలాపన, క్లర్క్ సుధాకర్, భక్తులు గిరి, మీనాక్షి, జయశ్రీ, సుధారాణి, రేణుక, రత్న తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వార్షిక బ్రహ్మోత్సవాలు



బ్రహ్మోత్సవాల్లో మహిళలు

బోడుప్పల్: పన్నాల రవీందర్‌రెడ్డి కాలనీలోని శ్రీకృష్ణ దేవాలయం ఏకాదశ వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ పన్నాల కృష్ణారెడ్డి మాట్లాడుతూ ధ్వజారోహణం, యాగశాల ప్రవేశం, ద్వారాతోరణ పూజ, అగ్నిముఖం, నిత్య పూర్ణాహుతి, సామూహిక లక్ష్మి కుంకుమార్చన భేరి పూజ కార్యక్రమాలు నిర్వహించినట్లు వెల్లడించారు. గురువారం శ్రీవిద్యా హయగ్రీవ హోమం, నిత్య పూర్ణాహుతి తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

మేడ్చల్ చైర్‌పర్సన్, కమిషనర్‌పై ఫిర్యాదు



సీడీఎంఏకు ఫిర్యాదు చేస్తున్న కౌన్సిలర్లు, బీఆర్‌ఎస్ నేతలు

మేడ్చల్: మున్సిపల్ చైర్ పర్సన్‌పై తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ అధికార బీఆర్‌ఎస్, కాంగ్రెస్ కౌన్సిలర్లు మున్సిపల్ సీడీఎంఏ సత్యనారాయణకు ఫిర్యాదు చేశారు. కౌన్సిలర్లు, మహిళా కౌన్సిలర్ల భర్తలు నగరంలోని సీడీఎంఏ కార్యాలయానికి చేరుకుని చైర్‌పర్సన్ దీపికపై ఫిర్యాదు చేశారు. చైర్‌పర్సన్, కమిషనర్లు విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తూ గతేడాది కాలంగా ఎలాంటి అభివృద్ధి పనులు చేయడం లేదని, శానిటేషన్, హరితహారం పనులను పట్టించుకోవడం లేదని, ప్రజా ధనం దుర్వినియోగం చేస్తూ పబ్బం గడుపుతున్నారని, 14 అంశాల్లో అవకతవకలు చేశారని ఆరోపించారు. కమిషనర్‌ను, ఆర్‌ఓను మేడ్చల్ నుంచి బదిలీ చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ రమేష్, కౌన్సిలర్లు, మహిళా కౌన్సిలర్ల భర్తలు హరికృష్ణ, నర్సింహ స్వామి, సాయికుమార్, రవిందర్‌రెడ్డి, సందీప్‌గౌడ్, మధుకర్‌యాదవ్, నరేందర్, రవిందర్, రాఘవేందర్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు

మేడ్చల్: మున్సిపాలిటీ పరిధిలోని అత్వెల్లిలో నూతనంగా నిర్మించిన ఆలయంలో శివపార్వతులు, నవగ్రహ విగ్రహాల ప్రతిష్ఠాపనోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. బుధవారం ఆలయంలో గ్రామస్థులు, నిర్వాహకులు చండీ హోమం, రుద్రహోమం, మన్యుసూక్త నవగ్రహ హోమాలు నిర్వహించారు. జగద్గురు శంకరాచార్యులు హంపీ స్వామి శోభాయాత్రను ప్రారంభించగా వేడుకలో మంత్రి మల్లారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులైన కౌన్సిలర్లు సరితమల్లేషగౌడ్, మానస శ్రవన్‌కుమార్ గుప్తా, గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

20 రోజులు.. 13,442 పరీక్షలు

- పేద ప్రజల్లో కంటి 'వెలుగు'
- మల్కాజిగిరి సర్కిల్‌లో 12 సెంటర్లు
- పరీక్షలకు అనూహ్య స్పందన

మల్కాజిగిరి: ప్రభుత్వం పేద, మధ్యతరగతి ప్రజల కోసం రెండో విడత ప్రారంభించిన కంటి వెలుగు కార్యక్రమం దాదాపు ఇరవై రోజులకు చేరింది. ఈ కేంద్రాలకు మల్కాజిగిరి సర్కిల్‌లో మంచి స్పందన వస్తోంది. సర్కిల్ పరిధిలోని నేరేడ్‌మెట్ డివిజన్‌లో ఒకటి, వినాయకనగర్ డివిజన్ పరిధిలో రెండు సెంటర్లు, మౌలాలి డివిజన్ పరిధిలో రెండు సెంటర్లు, ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్ పరిధిలో ఒకటి, మల్కాజిగిరి డివిజన్ పరిధిలో ఒకటి, గౌతం నగర్ డివిజన్ పరిధిలో రెండు సెంటర్లు ఏర్పాటు చేశారు. ప్రతిరోజూ ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్నారు. పరీక్షల అనంతరం వారికి సరిపోయే కంటి అద్దాలు ఉంటే అప్పుడే అందజేయడమే కాకుండా లేని వారికి సమయాన్ని కేటాయించి సమాచారం అందిస్తున్నారు. శస్త్ర చికిత్స అవసరమైన వారికి సిఫారసు చేస్తున్నారు. గతనెల 19వ తేదీ నుంచి ప్రారంభమైన ఈ కార్యక్రమంలో ఇరవై రోజులకు 13,442 మంది పరీక్షలు చేయించుకున్నారు.

కంటి పరీక్షల వివరాలు..

డివిజన్ పేరు	పరీక్షలు	అద్దాలు పొందినవారు	సిఫారసు
నేరేడ్‌మెట్	1,455	936	214
వినాయకనగర్	3,141	1,733	685
మౌలాలి	2,944	1,267	506
ఈస్ట్‌ఆనంద్‌బాగ్	1,477	669	134
మల్కాజిగిరి	1,669	1,219	73
గౌతంనగర్	2,756	1,691	463
మొత్తం	13,442	7,515	2,075



కంటి వెలుగును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత్‌రావు(ఫైల్)

పేద ప్రజలకు మేలు



ప్రభుత్వం చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమం పేద ప్రజలకు ఉపయోగపడుతోంది. బయట పరీక్షలు చేయించుకొని, కంటి అద్దాలు తీసుకోవడం ఖర్చుతో కూడుకుంది. పరీక్షల అనంతరం నాణ్యమైన కంటి అద్దాలు అందజేస్తున్నారు.

– సంతోష, మల్కాజిగిరి

సద్వినియోగం చేసుకోవాలి



కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి. 12 సెంటర్లు ఏర్పాటు చేశాం. కార్యక్రమానికి ప్రభుత్వం పెద్ద మొత్తంలో ఖర్చు చేస్తోంది. నాణ్యమైన కంటి అద్దాలు అందజేస్తున్నారు. శస్త్ర చికిత్స అవసరమైన వారికి సిఫారసు చేస్తున్నాం.

– జి.రాజు డిప్యూటీ కమిషనర్ మల్కాజిగిరి సర్కిల్

నిధులు మంజూరు చేసినందుకు కృతజ్ఞతలు

మల్లాపూర్: నాచారం భవానీనగర్ వంతెన(బ్రిడ్జి) పునర్ నిర్మాణానికి రూ.92 లక్షలు మంజూరయ్యాయి. ఈస్ట్ జోనల్ కమిషనర్ పంకజను జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యులు, నాచారం కార్పొరేటర్ శాంతి సాయిజెన్‌శేఖర్ బుధవారం కలిసి నిధులు మంజూరు చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఆమె మట్లాడుతూ.. నాచారంలో నాలాలతో ముంపు సమస్య తలెత్తకుండా వంతెనలు నిర్మించడానికి జోనల్ కమిషనర్ ప్రత్యేక చొరవ తీసుకున్నారన్నారు. డివిజన్ అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామన్నారు.



జోనల్ కమిషనర్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్న కార్పొరేటర్ శాంతి సాయిజెన్

మౌలిక వసతులు కల్పిస్తాం

బోడుప్పల్: దశలవారీగా మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్లు బోడుప్పల్ మేయర్ సామల బుచ్చిరెడ్డి అన్నారు. 19వ డివిజన్ పరిధిలోని ఈస్ట్ బృందావన్ కాలనీలో రూ 6.9లక్షల వ్యయంతో చేపట్టిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు బుధవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, తాగునీరు, పారిశుధ్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు వెల్లడించారు. 17వ డివిజన్‌లో రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని చేపట్టినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో 19వ డివిజన్ కార్పొరేటర్ సామల పవన్‌రెడ్డి, కాలనీ అధ్యక్షుడు బొమ్మక్ శ్రీనివాస్, టీఆర్‌ఎస్ నాయకులు ఉప్పరి విజయ్ తదితరులున్నారు.



డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేస్తున్న మేయర్ బుచ్చిరెడ్డి

నిజాయితీగా విధులు నిర్వర్తించండి



రాధిక చౌరస్తాలో ఫుట్‌పాత్‌ల ఆక్రమణలపై సిబ్బందికి సూచనలు ఇస్తున్న సీపీ చౌహాన్

రాచకొండ పోలీస్ కమిషనర్ డీఎస్.చౌహాన్

మల్కాజిగిరి: విధి నిర్వహణలో ఎలాంటి ఆరోపణలకు తావులేకుండా నిజాయితీగా విధులు నిర్వహించాలని రాచకొండ పోలీస్ కమిషనర్ డీఎస్.చౌహాన్ సూచించారు. మల్కాజిగిరి పోలీస్‌స్టేషన్‌ను ఆయన డీసీపీ జానకి, ఏసీపీ నరేష్‌రెడ్డితో కలిసి బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐలను వారు బాధ్యతలు నిర్వర్తించే సెక్టార్ల వివరాలు, కేసుల గురించి వాకబు చేశారు. వివిధ సెక్షన్లలో ఉన్న సిబ్బంది పనితీరును అడిగి తెలుసుకున్నారు. మల్కాజిగిరి పోలీస్‌స్టేషన్ పరిధి, జనాభా, కాలనీలు, సీసీ కెమెరాల ఏర్పాటు తదితర అంశాలను మల్కాజిగిరి ఇన్‌స్పెక్టర్ జగదీశ్వరరావు సీపీకి వివరించారు. కాలనీ అసోసియేషన్ల ఆధ్వర్యంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేందుకు అవగాహన కల్పించాలని ఇన్‌స్పెక్టర్‌కు సూచించారు.



మహిళా సిబ్బందితో మాట్లాడుతున్న డీఎస్.చౌహాన్

ఫుట్‌పాత్‌ల ఆక్రమణపై కఠినంగా వ్యవహరించాలి

కుషాయిగూడ: కుషాయిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రద్దీ ప్రాంతాల్లో రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్ బుధవారం పర్యటించారు. రాధిక చౌరస్తా, ఈసీఐఎల్ చౌరస్తా, కుషాయిగూడ ప్రాంతాలను ఆయన పరిశీలించారు. ఫుట్‌పాత్‌ల ఆక్రమణలతో ట్రాఫిక్ సమస్యలు, పాదచారులు పడుతున్న ఇబ్బందులను ఆయన స్వయంగా గమనించారు. ఫుట్‌పాత్‌ల ఆక్రమణలను తొలగించాలని సూచించారు. జీహెచ్‌ఎంసీ అధికారుల సమన్వయంతో ఈసీఐఎల్, రాధిక చౌరస్తాలను అభివృద్ధి చేసే దిశగా కార్యాచరణ చేస్తామన్నారు. ఫుట్‌పాత్‌ల ఆక్రమణపై కఠినంగా వ్యవహరించాలని ఆయన ట్రాఫిక్ పోలీసులకు సూచించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ డీసీపీ అభిషేక్ మహంతి, మల్కాజిగిరి డీసీపీ ధరావత్ జానకి, కుషాయిగూడ ఏసీపీ వెంకట్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలి

ఘట్‌కేసర్: ఎదులాబాద్‌లో గ్రామంలో అక్రమాలకు పాల్పడిన అధికారులు, ప్రజాప్రతినిధులపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని బీజేపీ రూరల్ జిల్లా అధ్యక్షుడు విక్రంరెడ్డి డిమాండ్ చేశారు. ఎదులాబాద్ పంచాయతీ కార్యాలయం ఎదుట బీజేపీ మండలాధ్యక్షుడు ప్రవీణ్‌రావుతో కలిసి బుధవారం నిర్వహించిన నిరసనలో ఆయన పాల్గొని మాట్లాడారు. పేదలకు జరిగిన అన్యాయాన్ని బీఆర్‌ఎస్ నాయకులు పక్కదారి పట్టించాలని చూస్తే వారికి న్యాయం జరిగే వరకు గ్రామ ప్రజలతో కలిసి బీజేపీ పోరాటం చేస్తోందన్నారు. ఈ నిరసనలో బీజేపీ కార్యవర్గ సభ్యుడు శ్రీనివాస్, మండల ప్రధాన కార్యదర్శి శ్రీశైలం, ఓబీసీ రాష్ట్ర నాయకుడు రామోజీ, జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీరాములు, బీజేపీ స్థానిక శాఖ అధ్యక్షుడు కుమారస్వామి, సాయికిరణ్, మల్లేశ్, హరికృష్ణ, వెంకట్, రాజేశ్, చిరంజీవి, నాగరాజు, ఆంజనేయులు, శ్రీను, నరసింహా, ప్రవీణ్‌రెడ్డి, భాస్కర్ పాల్గొన్నారు.

క్రీడలతో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు



క్రీడాకారిణులను అభినందిస్తున్న గౌతంరావు, మనోహర్‌రెడ్డి

ఘట్‌కేసర్: క్రీడలతో జాతీయ, అంతర్జాతీయ త్వరగా గుర్తింపు లభిస్తోందని అవుషాపూర్ విజ్ఞాన భారతి ఇంజినీరింగ్ కళాశాల(వీబీఐటీ) చైర్మన్ ఎస్.గౌతంరావు, కార్యదర్శి జి.మనోహర్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్ బిట్స్ పిలాని క్యాంపస్‌లో ఇటీవల జరిగిన ఎరీనా–23 నేషనల్ కబడ్డీ చాంపియన్ షిప్‌లో రన్నరప్‌గా నిలిచిన వీబీఐటీ కబడ్డీ క్రీడాకారిణులకు కళాశాలలో బుధవారం సభ ఏర్పాటు చేసి వారిని అభినందించారు. కార్యక్రమంలో కళాశాల ఫిజికల్ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, క్రీడాకారిణులు పాల్గొన్నారు.

3వ రోజు హాత్ సే హాత్ జోడో యాత్ర



హబ్సిగూడ: హాత్ సే హాత్ జోడో యాత్ర 3వ రోజు ఉత్సాహంగా సాగింది. హబ్సిగూడలో బుధవారం ఇంటింటికీ పాదయాత్ర నిర్వహించారు. ప్రతి ఒక్కరినీ పలకరిస్తూ ముందుకు సాగారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలను మోసం చేస్తున్నాయని వివరించారు. రాజ్యాంగం ఇచ్చిన స్వేచ్ఛ ప్రతి ఒక్కరికీ దక్కాలన్నా.. రాజ్యాంగ స్ఫూర్తితో పాలన జరగాలన్నా అది కాంగ్రెస్‌తోనే సాధ్యమని పలువురు తెలిపారు. కార్యక్రమంలో ఉప్పల్ ఏ బ్లాక్ అధ్యక్షుడు, సీనియర్ నేత మందముల పరమేశ్వర్‌రెడ్డితో పాటు హబ్సిగూడ డివిజన్ అధ్యక్షుడు కాలేరు జైనవీస్ ఉన్నారు. టీపీసీసీ ప్రతినిధులు మేకల శివరెడ్డి, తౌఫిక్, టీపీసీసీ సెక్రటరీ పసుల ప్రభాకర్‌రెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు పత్తి కుమార్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు మాజీ కౌన్సెలర్స్ కంది ఆగిరెడ్డి, గుంతుక కృష్ణ, గుజల లక్ష్మారెడ్డి, రఘుపతిరెడ్డి, తెలికల మోహన్‌రెడ్డి, రామ్‌రెడ్డి, సుర్వి మురళిగౌడ్, మక్తాల శేఖర్‌గౌడ్, కరిప శంకర్, మురళి కృష్ణ ముదిరాజ్, డివిజన్ల అధ్యక్షులు బాకారం లక్ష్మణ్, కొంపల్లి బలరాజ్, రఫిక్, ఏ బ్లాక్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు జలీల్ పాషా, ఏ బ్లాక్ మహిళా అధ్యక్షులు అమరేశ్వరి, ఏ బ్లాక్ ఇ సెల్ అధ్యక్షులు లింగంపల్లి రామకృష్ణ, మహిళా కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు బుక్యా మాధవి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవ పనుల్లో వేగం పెంచాలి

అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్య

కీసర: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని కీసరగుట్ట శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యేందుకు మరో వారం రోజులు మాత్రమే ఉన్నందున పనుల్లో వేగం పెంచాలని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్య అన్నారు. కీసరగుట్టలో కొనసాగుతున్న పనులను బుధవారం ఆయన పరిశీలించారు. ఆలయ పరిసరాల్లో రంగులు వేయడం, క్యూ సిద్ధం చేయడం, చలువ పందిళ్ల ఏర్పాటు తదితర పనులు దాదాపు పూర్తి కావచ్చయని ఆలయ చైర్మన్ తటాకం రమేష్‌శర్మ అదనపు కలెక్టర్‌కు వివరించారు. పార్కింగ్ ప్రదేశాల్లో చదును చేసే పనులు ప్రారంభం కాకపోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. మంచినీటి సరఫరా నిమిత్తం ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ ఆధ్వర్యంలో పనులు, విద్యుత్ లైన్ల మరమ్మతులు, అదనపు ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు తదితర పనులు కొనసాగుతున్నాయని ఎంపీడీఓ రమాదేవి వివరించారు. మూడు రోజుల్లో పనుల్లో పురోగతి కనిపించాలని సంబంధిత అధికారులకు అభిషేక్ అగస్త్య సూచించారు.

ట్రాన్స్‌కో.. జర దేఖో..

- ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు
- భయాందోళనకు గురువుతున్న ప్రజలు

గౌతంనగర్: డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదాలకు నిలయంగా మారుతున్నాయి. మల్లికార్జునగర్, మిర్జాల్‌గూడ తదితర ప్రాంతాల్లో రోడ్డు పక్కనే ట్రాన్స్‌ఫార్మర్లు భయాందోళకు గురిచేస్తున్నాయి. కొన్నిచోట్ల ఎత్తు తక్కువగా ఉండి వైర్లు కిందికి వేలాడుతుంటే మరికొన్ని చోట్ల ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ కంచె లేకపోవడంతోపాటు విద్యుత్ వైర్లు భూమికి వేలాడుతుండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రానున్న ఎండాకాలంలో ప్రమాదాలు జరిగే ఆస్కారం ఉందని ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించాలని ఆయా ప్రాంతాలవాసులు కోరుతున్నారు.



మల్లికార్జుననగర్ ప్రధాన రోడ్డు మార్గంలో..

వ్యభిచార గృహాలపై దాడి

ఉప్పల్: వ్యభిచారం నిర్వహిస్తున్న రెండు శిబిరాలపై ఉప్పల్ పోలీసులు దాడి చేసి నిర్వాహకులతో పాటు విటులను అరెస్టు చేసిన ఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాలు ప్రకారం.. రామంతపూర్ ఆర్టీసీ కాలనీలో ఓ ఇంటిని అద్దెకు తీసుకున్న లక్ష్మీ, అరుణ వ్యభిచారం నిర్వహిస్తున్నారు. సమాచారం అందుకున్న ఉప్పల్ పోలీసులు ఇంటిపై దాడి చేసి నిర్వాహకులతో పాటు ఇద్దరు విటులు శుభాని, వెంకటేశ్‌ను అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద నుంచి రూ.3,300 నగదు, రెండు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు.

సాయికృష్ణానగర్‌లో..

రామంతపూర్ సాయికృష్ణానగర్‌ని ఓ ఇంట్లో వ్యభిచారం నిర్వహిస్తున్న నందిని, రాజుతో పాటు విటుడుని అరెస్టు చేశారు. రెండు నెలల నుంచి వ్యభిచారం నిర్వహిస్తున్నారనే సమాచారం అందుకున్న పోలీసులు గృహంపై దాడి చేసి విటుడు, నిర్వాహకులను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. వీరివద్ద నుంచి రూ.1,500ల నగదును స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

వృద్ధుడి మృతదేహం లభ్యం



కుషాయిగూడ: ఓ గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహాన్ని బుధవారం కుషాయిగూడ పోలీసులు గుర్తించారు. హెచ్‌బీకాలనీ, నెహ్రూనగర్ బస్టాప్ వద్ద 55–60 సంవత్సరాల వయసు కలిగిన ఓ వృద్ధుడు అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. కుషాయిగూడ పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని వృద్ధుడిని పరిశీలించారు. అపస్మారకస్థితిలో ఉన్న అతడిని 108లో గాంధీ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు వృద్ధుడు చనిపోయినట్లు తెలిపారు. ఎలాంటి ఆధారాలు లభ్యం కాకపోవడంతో గుర్తు తెలియని మృతదేహంగా కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి సంబంధించిన వారు ఎవరైనా ఉంటే కుషాయిగూడ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్‌ఐ షఫీ కోరారు.

ఉద్యోగం లేదని యువకుడు ఆత్మహత్య

అల్వాల్: ఉద్యోగం లేదనే మనస్థాపంతో యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన అల్వాల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. నీరజ్‌రాజ్(30) ఇంట్లో ఎవరూ లేని సమయంలో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఉద్యోగం లేకపోవడం వలన ఖాళీగా ఉంటూ మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకొని ఉంటాడని కుటుంబ సభ్యులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పోలీసు భద్రత మరింత పటిష్టంగా..

- సర్కిల్ నుంచి డీసీపీ స్థాయికి మేడ్చల్
- సంఖ్య పెరగడంతో తీరనున్న ప్రజల ఇబ్బందులు

ప్రజలకు చేరువయ్యేలా మేడ్చల్ నియోజకవర్గంలో పోలీస్ వ్యవస్థ

మేడ్చల్: రాష్ట్రంలో వివిధ వ్యవస్థల్లో వస్తున్న మార్పులకు అనుగుణంగా మేడ్చల్‌లో పోలీస్ వ్యవస్థ ప్రజలకు మరింత చేరువగా మారింది. గ్రామీణ, పట్టణ ప్రాంతాల మెళవింపుగా మేడ్చల్ పరిసర ప్రాంతాల్లో ప్రజల ఇబ్బందులను తీర్చేందుకు, శాంతి భద్రతలను మరింతగా పరిరక్షించేందుకు నియోజకవర్గంలో పోలీసు వ్యవస్థను పటిష్టం చేయనున్నారు.

సర్కిల్ నుంచి డీసీపీ స్థాయి వరకు..

సైబరాబాద్ ఆవిర్భవించక ముందు మేడ్చల్ నియోజకవర్గం రంగారెడ్డి ఎస్పీ పరిధిలో ఉండేది. నాడు ఒక ఎస్‌ఐ ఎస్‌హెచ్‌ఓగా ఉండేవారు. మేడ్చల్, శామీర్‌పేట్, దుండిగల్ పోలీస్‌స్టేషన్లకు కలిపి ఒక సీఐ ఉండే వారు. డీఎస్పీ నగరంలో ఉండేవారు. తదనంతరం చోటు చేసుకున్న మార్పులతో సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో సీఐ ఎస్‌హెచ్‌ఓగా నలుగురు ఎస్‌ఐలు కలిసి ఒక స్టేషన్‌కు ఉన్నారు. అదే తరహాలో మేడ్చల్ పేట్ బషీరాబాద్ ఏసీపీ పరిధిలో బాలానగర్ డీసీపీ జోన్ కింద నడిచింది. తాజాగా హోంశాఖ కసరత్తు చేసి డివిజన్ల పునర్విభజన చేయడంతో మేడ్చల్ పేరుపై ఉన్నతాధికారుల కార్యాలయాలు వచ్చాయి. బాలానగర్ డీసీపీ జోన్‌ను విభజించి మేడ్చల్, బాలానగర్ జోన్లుగా మార్చారు. దీంతో సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో మేడ్చల్ డీసీపీ జోన్‌గా ఏర్పడింది. పేట్‌బషీరాబాద్ ఏసీపీ జోన్‌ను పేట్‌బషీరాబాద్, మేడ్చల్‌గా విభజించి రెండు జోన్లుగా మార్చారు. మేడ్చల్ డీసీపీ జోన్ పరిధిలో మేడ్చల్, పేట్‌బషీరాబాద్ ఏసీపీలు ఉండగా, మేడ్చల్ ఏసీపీ పరిధిలో మేడ్చల్, శామీర్‌పేట్ పోలీస్‌స్టేషన్లు ఉన్నాయి. ఇన్నాళ్లు ట్రాఫిక్‌లో అల్వాల్ పరిధిలో ఉండగా మేడ్చల్‌కు ప్రత్యేకంగా ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేశారు. దీంతో నాటి సీఐ స్థాయిలో నేడు ఏసీపీని ఏర్పాటు చేయడంతో పోలీస్ వ్యవస్థ ప్రజలకు దగ్గరగా చేరినట్లుంది.



మేడ్చల్ పోలీస్ స్టేషన్

తగ్గనున్న ప్రమాదాలు..

మేడ్చల్ ఏసీపీ పరిధిలోని 44వ జాతీయ రహదారి, రాజీవ్ రహదారిలు ఉన్నాయి. ఈ రెండు రోడ్లలో నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుండటంతో ప్రమాదాల సంఖ్య ఎక్కువే ఉండేది. ప్రమాదాల నివారణకు ఉన్నతాధికారులు చేపట్టబోయే చర్యలతో ప్రమాదాల సంఖ తగ్గే అవకాశం ఉంది.

నిఘా పెరిగి నేరాలు తగ్గే అవకాశం...

మేడ్చల్‌లో అధికంగా పరిశ్రమలు, రిసార్టులు, వీఐపీలు నివాసం ఉండే విల్లాలు, అపార్ట్‌మెంట్లు ఉండటంతో వీఐపీల రాకపోకలతో ఈ ప్రాంతం బిజీగా ఉంటుంది. వివిధ రకాల పనులు, ఉపాధి కోసం దేశంలోని అన్ని ప్రాంతాల వారు స్థానికంగా ఉంటున్నారు. సహజంగానే వలస ప్రాంతాల్లో క్రైమ్ రేటు ఎక్కువగానే ఉంటుంది. ఇలాంటి ప్రాంతాలకు డీసీపీ, ఏసీపీ, ట్రాఫిక్ వంటి నూతన అధికారులు రావడంతో పోలీసుల సంఖ్య పెరగడంతో పాటు నిఘా పెరిగే అవకాశమున్నందున నేరాలు సంఖ్య తగ్గే సూచనలు ఉన్నాయి.

మరో నాలుగు ప్రతిపాదనలు..

మేడ్చల్ ఏసీపీ పరిధిలో జనాభాకు అనుగునంగా మరిన్ని పోలీస్ స్టేషన్లు ఏర్పడే ప్రతిపాదనలు ఉన్నట్లు తెలుస్తోంది. మేడ్చల్ మండలంలోని డబీల్‌పూర్‌లో రూరల్ పోలీస్‌స్టేషన్, గుండ్లపోచంపల్లిలో, మూడుచింతలపల్లిలో, తూంకుంటలో పోలీస్‌స్టేషన్లు ఏర్పాటు చేయాలని పోలీసు ఉన్నతాధికారులు కసరత్తు చేస్తున్నట్లు సమాచారం.

స్థానికుల్లో హర్షం...

15 ఏళ్ల క్రితం పూర్తిగా గ్రామీణ ప్రాంతంలా ఉన్నా మేడ్చల్ అభివృద్ధికి అనుగుణంగా పోలీసు వ్యవస్థలో మార్పులు తెస్తున్నారు. దీంతో ప్రజల చేంతకు పోలీసులను తీసురావడంతో స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.